# శిలకోల

## కథలు

మల్లిపురం జగదీశ్



# శిలకోల

## కథలు

మల్లిపురం జగదీశ్

స్నేహకళాసాహితి ప్రచురణ
కురుపాం / పార్వతీపురం

**SILAKOLA**
*Kathalu*
*Mallipuram Jagadeesh*

Copies : 500

July 2011
*A publication of SNEHA KALASAHITHI, Kurupam*

*For Copies :*
**Mallipuram Jagadeesh**
Hudco Colany;
Gummalaxmi Puram,
VIJAYANAGARAM - 535523
Cell : 94401 04737

*Cover Design :*
A.Giridhar
Cell : 97042 44344

*DTP : A.Prasanna Ganesh*

*Printing :*
Sri Sri Printers
Vijayawada - 2
Cell : 94906 34849

Price : Rs. 100/-

# కథా క్రమం


| | | |
|---|---|---|
| ఈ కథల రచయిత గురించీ రచనల గురించీ... | కాళీపట్నం రామారావు | 7 |
| కఠోరవాస్తవాలకు కళాత్మక చిత్రణ | గుడిపాటి | 8 |
| లంకెల ముచ్చులపాలిట శిలకోల....! | అట్టాడ అప్పల్నాయుడు | 15 |
| శిలకోల సంధిస్తున్న విలుకాడి కోసం... | గంటేడ గౌరునాయుడు | 18 |
| కొండకి నమస్కరించి... | మల్లిపురం జగదీశ్ | 22 |
| అక్షరాల దారిలో.... | | 25 |
| అరణ్య రోదన | | 32 |
| ఉరులు | | 37 |
| కలలు కాలుతున్న వాసన | | 45 |
| పొరలు | | 52 |
| గాయం | | 62 |
| దాడి | | 71 |
| దారి | | 78 |
| శిలకోల | | 87 |
| సిందవ | | 95 |
| కళ్ళం | | 101 |
| 'టిహిలి'కి పెళ్ళి | | 111 |
| వాన | | 121 |
| ఇప్ప మొగ్గలు | | 125 |
| బాకుడుంబారి | | 134 |
| గాయం సృజనకు పుట్టిల్లు | అట్టాడ అప్పల్నాయుడు | 144 |
| కథా ప్రపంచానికి కొత్త ఆశ | గంటేడ గౌరునాయుడు | 146 |

# అక్షరాల దారిలో....

సన్నాయికి మెలకువ వచ్చింది. ఉదయం మేల్కొంది.

లేచి చుట్టూ చూసేడు. ఒకళ్ళనొకరు పెనవేసుకొని, ఒకరి కాళ్ళు ఇంకొకరి మీద వేసి, గుట్టలు గుట్టలుగా పడుకున్నారు విద్యార్థులంతా... రోకలిబండి పిల్లల్లా. కిటికీలు, తలుపులు బిగించి వున్నాయి. గెడలు లేని కిటికీ సందుల్లోంచి చల్లని గాలి సర్రున వీస్తోంది అగ్గిపుల్ల మాస్టారు వదిలే సిగరెట్టు పొగలా.

వరండాలోకొచ్చి నిలబడ్డాడు. చీకటింకా విచ్చుకోలేదు. మంచు మాత్రం అదే పనిగా కురుస్తోంది. సంచి అందుకున్నాడు. గేటు దాటి రోడ్డెక్కాడు. మెల్లగా పరుగు ప్రారంభించాడు. మెలికలు తిరుగుతూ నల్లటి రోడ్డు. సంతకెల్తున్న సవరోల్లా రోడ్డు కిరువైపులా చెట్లు ఒక్కొక్కటిగా వెనక్కి వెళ్తున్నాయి. క్రమంగా వేగం పుంజుకున్నాయి.

ప్రేయర్లో నిలబెట్టి అందరి ముందు మాస్టారు తిట్టిన తిట్లు ఇంకా వినిపిస్తున్నాయి. ఒక్కొక్కటీ గుర్తుకొస్తుంటే ఏడుపు ముంచుకొచ్చింది.

" అడ్డ గాడిద, ఎక్కడికెల్లేవురా యూస్ లెస్ ఫెలో..."

సెలవులికి ఇంటికెళ్ళే దారిలో సిందవ ఎదురైనప్పుడు కూడా బెదరలేదు. కానీ ఆ కేక కి గడ గడా వణికి పోయాడు.

ఎన్నో సమాధానాలున్నాయి. ఏవీ పెదవి దాటలేదు. వార్డెన్ హెచ్చరిక గొంతు నొక్కేసింది.

"చెప్పు. నిన్న డి.టీ.డబ్ల్యు.ఓ. వచ్చినప్పుడు క్లాసులో లేవు. నీ వల్ల మాకు తిట్లు. మేమేం తప్పు చేసేమని శిక్ష అనుభవించాల్రా.. చెప్పు. లం.... "

నడుమ్మీద బెల్టు ఫర్ర్... మని లాగి, చెళ్... చెళ్ మని తగిలించేరు.

ఆ దెబ్బలకి యూనీఫారాలన్నీ బిక్క చచ్చి పోయేయి. పూల తోట మౌనంగా రోదించింది. సమాధానం తన్నుకొచ్చింది. అంతలోనే అక్కడే గుడ్లు మిటకరిస్తున్న వార్డెన్ కలుగజేసుకున్నాడు.

“ సర్.. నేనే పంపించాను.” సంజాయిషీగా నీళ్ళు నమిలేడు.

అదేంటో వార్డెన్ ఎప్పుడూ హెడ్ దగ్గర బెదురు గొడ్డులాగే తిరుగుతుంటాడు. అదే బెదురు గొడ్డు ఏమ్మాయ చేస్తుండో గాని ఏ మాట చెప్పినా చప్పున చల్లారిపోతాడతను.

సమాధానం రాకుండా చేయడానికి ఎన్ని తంటాలు పడ్డారు! ఎన్ని సమాధానాలని ఆపగలరు? మందు సీసాలు తేవడానికి వెళ్ళానని సమాధానం ఇచ్చుంటే ఏమయ్యేది? అది పంపించిన వార్డెన్ తల పైకి లేచేదా? పైకి లేచిన బెల్టు ఏమైపోయేది?

ముఖానికి చల్లని గాలి రువ్వున తగలడంతో పరుగు ఆపి నిబడ్డాడు సన్నాయి. వూరి పొలి మేరలు దాటి గెడ్డకు వచ్చేసాడు. కాలకృత్యాలు తీర్చుకున్నాడు. కాగు పుల్ల విరిచి పళ్ళు తోమేడు. గెడ్డలో దిగి స్నానం చేసేడు.

అదే స్నానం హాస్టల్ లో అయితే...!? పురుగులున్న కిలుం నీళ్ళయినా ఇవ్వలేని బోరింగులు. అవి తోడడానికి చెమట స్నానమే చెయ్యాలి. వంటపాక బోరింగు దగ్గరైతే వర్కర్లు, పిల్లలు నీళ్ళ కోసం పిల్లి, కుక్కలైపోతారు. పక్కనున్న గెంజి కాలువ మాత్రం ఈగల ఈలలు, దోమల పాటలతో వారి పోటీకి సై సై అంటున్నట్లు నిలబడి చూస్తు ఉంటుంది.

ఆ బాధ లేదిప్పుడు అనుకొని నడక ప్రారంభించేడు. పొద్దు బారెడెక్కింది. ఈ పాటికి ఫస్ట్ బెల్లు కొట్టే వుంటారు. స్కూలు విడిచి పారిపోతున్నా అక్కడి దినచర్య వెంటాడుతునే వుంది.

అప్పారావు..

సన్నాయి...

చిరంజీవులు...

కరువులు...

హాజరు పిలిచేరు మాస్టారు. ఇంటూలు ఇంటూలుగా పలికేరు పిల్లలు. పలకని ఇంటూలు వార్డెన్ జేబులో ఎత్తుగా.

బోర్డు మీద అంకెలు సృష్టిస్తున్నారు మాస్టారు. మరు నిముషం అదృశ్యం అయిపోతున్నాయి అవి. చెక చెకా పరుగెడుతున్నాయి లెక్కలు. సిలబస్ తొందర చేస్తూందేమో.... ఇంకా వేగంగా పరుగెడుతున్నారు మాస్టారు. మధ్య మధ్యలో “అర్థమైందా...?” అంటున్నారు. అంకెలు మాయమైతే నోట్సు నిండదని గబగబా ఎక్కించేస్తున్నారు పిల్లలు.

లెక్క పూర్తయినట్లుంది. అందరి వైపు ఒక సారి దృష్టి సారించేరు. ఆ మూల కూర్చున్న సన్నాయి దొరికిపోయేడు. వాడికి బోర్డు మీద పరిమ్ముళ్ళ కంప వేలాడుతున్నట్టు కనిపించిందేమో ఆ లెక్క.

"రేయ్ సన్నాయ్... లెక్కెక్కించకుండా ఏట్రా ఆలోచిస్తున్నావు?" అంటూ దగ్గరకొచ్చి వీపుమీద ఒక్కటి తగిలించేరు.

ఇంతలో కిటికీ నుంచి సంచి మేస్టారు వచ్చి "మాస్టారూ.. ఆరుగురు చాకుల్లాంటి కుర్రాళ్ళు కావాలండీ." అని అడిగారు.

"ఓ దానికేం భాగ్యం, తీసుకెళ్ళండి." అని పర్మిషన్ ఇస్తూ ఇవాల్టికి తన పనైపోయిందన్నట్టుగా చేతులు దులుపుకుంటూ క్లాసు బయటికి నడిచేరు లెక్కల మాస్టారు.

ఆరు చాకుల్ని ఎంచుకున్నారు సంచి మాస్టారు. మూడు చాకుల్ని ఉసిరికాయలు తెంపడానికి, మరో మూడు చాకుల్ని పక్క వూరి డిపో నుంచి పంచదారకని పంపించేరు.

బెల్లు మోగింది. పొట్టి మాస్టారు లోపలికొచ్చేరు. వస్తూ 'ఓపెన్ యువర్ టెక్స్ట్‌బుక్స్.' అంటూ కుర్చీలో కూలబడ్డారు.

పాఠం మొదలుపెట్టారు. చదువుతున్నారేమో, మాస్టారి పెదవులు చిత్రంగా కదులుతున్నాయి. పిల్లల చూపుడువేళ్ళు పేరాల్లోని లైన్లను వెంబడిస్తూ పరిగెడుతున్నాయి. భాష తెలియని వీధిలో నడుస్తున్నట్లుంది. ఈ క్లాసులో బొమ్మలేసుకోవచ్చు, మిగిలిపోయిన హోం వర్కు చేసుకోవచ్చు, కాళ్ళు చాపి నిద్రపోనూ వచ్చు. ఎందుకంటే మాస్టారు పిల్లలవైపు చూడనే చూడరు. మధ్య మధ్యలో పుస్తకం లోంచే ఒక కేక వినిపిస్తుంది. ఆ గాబరాకి చూపుడు వేలు దారి తప్పిపోతుంది. అది పట్టుకొనే లోగా పాఠం పారిపోతుంది. మాస్టారు కుర్చీని మాత్రం వదలరు.

'ఈ మేషారింకా నయం. చీకటి ఖండం మేషారైతే "అదర్రా" అనేసి చరిత్రంతా ఒకే రోజు తిరగేసి గలరు. ఈ చరిత్రొకటి. అదెక్కడ మొదలౌతుందో గాని ఏదీ అర్థం కాదు. ఆ మాటంటే "మట్టి బుర్రలు, ఒక్క రోజైనా పుస్తకం తీస్తే అర్ధమౌతుంద"ని నెత్తి మీద ఒక మొట్టికాయ వేస్తారు.'

గతుక్కుమన్నాడు. రాయి తన్నుకొని ముందుకి తూగేడు. గుండె మీద తుప్.. తుప్ మని ఉమ్ముకున్నాడు. వూరి దగ్గరకి వచ్చేసేడు. చింత చెట్టు క్రింద 'సిర్తా బిల్లా' ఆడుతున్న ఆది గాడు, సొంబర, జడ్డిడు సన్నాయి చుట్టూ చేరేరు. పలకరించేరు. ఇంట్లో నాన్నడిగేడు "సెలవులేట్రా?" అని. అవునన్నట్టు కాక, కాదన్నట్టు కాక అడ్డదిడ్డంగా తల వూపి డోకిడు నీళ్ళతో కాళ్ళూ చేతులూ కడుక్కున్నాడు సన్నాయి.

అమ్మ కొర్ర బువ్వ వడ్డించింది. తింటుండగా కణేల్ మని రాయి తగిలింది. ఠక్కున హాస్టల్ గుర్తొచ్చింది.

రోజూ అంతే. వుడికీ వుడకని అన్నం, అందులో రాళ్ళు, పురుగులు, రుచీ పచీ లేని కూరలు.. ఈగలు రుచి చూసినాకే పిల్లలు తినాలి. తాగేసి వండుతున్న వర్కర్లు...

మసిబారిన వంట పాక... దానికానుకొని గెంజి కాలువ... దాంట్లో దొర్లే పందులు... నిరంతరం భరించరాని కంపు... వీటి మధ్యే సంచరిస్తూ అవకాశం దొరికినప్పుడల్లా అండాల్లో మూతి పెట్టే కుక్కలు.

ఒక్క సారిగా పొలమారేడు. పక్కనే కూర్చున్న అమ్మ తలమీద చిన్నగా కొట్టింది 'ఎవలు తలుస్తున్రో' అని.

తినడం అయ్యేక ఆటకు తయారైపోయేడు. మామిడి తోటలో కోతి పిల్లకగ్రాట ఆడుతూ కోతుల్లో కోతైపోయాడు. గొట్టి పిక్కలాడేడు. సిర్రా బిల్లా ఆడేడు. చెట్లెక్కేడు... గెంతులేసేడు, ఇసుకలో దొర్లేడు. గెడ్డ గుమ్మిలో గెంతి ఈత కొట్టేడు.

పొద్దు కూడా అలిసి పోయిందేమో కొండమీదకు వాలి వెర్రి చూపులు చూస్తోంది లాస్టు పీరియడ్‌లో లెక్కలు వింటున్న విద్యార్థిలా.

గడపలో కూర్చున్నాడు విశ్రాంతిగా.... ఎంత ఆనందంగా గడిచిందీ రోజు! ఇక్కడ ఏ మాస్టారు అడ్డుకోరు. ఏ హాజరూ వుండదు, ఏమీ అప్పజెప్పక్కర్లేదు. ఏ బెత్తము చావకొట్టదు. ఏ బెల్లు కట్టి పడేయదు.

హాయిగా ఊపిరి పీల్చుకుంటూ రాటకు చేరబడ్డాడు. ఏదో వెలితి... అసంతృప్తి. ఇష్టమైన పాటల మాస్టారు గుర్తొచ్చారు. దిగులు వెంటాడుతోంది. ఈ పాటికి లాంగ్ బెల్లు అయిపోయి ఉంటుంది. పుస్తకాలు పెట్లో పెట్టి గ్రౌండులోకి పారిపోయుంటారు మిత్రులు. అక్కడా ఆడుకోవచ్చు. కానీ డ్రిల్ మాస్టారు చెప్పినట్లు ఆడాలి.

" పీఁ...పీఁ... పీఁ..." డ్రిల్ మాస్టారి విజిల్ వినిపించింది. ఎక్కడి వాళ్ళక్కడ స్టిల్ పొజిషన్ లో ఫ్రీజ్ అయిపోవాలి.

కానీ... ఆ గుంటడు ఒంటి కాలిమీద నిలబడలేక రెండో కాలు కదిపేడు. అంతే. 'ఒరే లం..... కొడకా...' అని విజిల్ బెల్ట్ వాడి వీపు మీద ఛెళ్ మంది.

కబడ్డీ టీములు ఆటకు దిగేయి. కేంట్‌కెళ్ళిన వాడు అంటకూడని లైన్ ని అంటుకున్నాడు ఒకడు.

'ఒరే అడ్డ గాడిదా... దున్న పోతా... అన్నం తింటున్నావా.. అశుద్ధం తింటున్నావా..? ఏంటి చెప్పేను. ఆ లైన్ టచ్ అవకూడదన్నానా?' అని విజిల్ బెల్ట్ కి పని కల్పించేరు.

అడుగేస్తే తిట్ల భయం. అడుగు తీస్తే బెల్ట్ భయం. వెంటాడుతున్న భయంలోంచి అన్ని ఆటలు ఆడాలి.

ఆ రోజు..

ఏ మాస్టారూ లేరు. హాయిగా కబడ్డీ ఆడుతుంటే.... 'రేయ్ రారా ఇటు' అని

బూతద్దాల మాస్టారు కేకేసారు. ఎవరిని పిలిచారో తెలీక ఎవరూ కదల్లేదు. చివరికి తనే వెళ్ళేడు.

'ఏరా.. పిలిస్తే వినబడదేటి? పనికిమాలిన వెధవా. వెళ్ళి నిప్పు పట్రా.' అని గదమాయించేరు. వంట పాక కేసి పరుగందుకున్నాడు. వంటపాక నీడలో వంటమ్మతో వెకిలి జోకులేస్తూ పళ్ళికలించి పొంగిపోతున్న వార్డెన్ ఎదురుపడ్డాడు.

అన్నంలో పురుగులెందుకొస్తాయో... పప్పులో రాళ్ళెందుకు వస్తాయో అర్థం అయినట్లు నిశ్శబ్దముగా నిప్పు తీసుకొని పారిపోబోయేడు.

"ఒరేయ్.." వార్డెన్ కేకతో ఆగిపోయాడు. వాడి గుండె క్షణం ఆగింది. కాళ్ళు వణికేయి. 'ఇక్కడేం పనిరా నీకు?' అడ్డుపుల్ల అయ్యాడని కోపంగా అడిగారు. చెప్పేడు. 'ఇక్కడేమైనా చూసేవేటి?' చేతిలోని బెత్తం అడిగింది. లేదన్నట్లు తలకాయూపేడు.

'పో..' అని వదిలేసింది బెత్తం.

పులి చూపుని తప్పించుకున్న లేడి పిల్లలా పారిపోయేడు. స్టోర్ రూమ్ మలుపు తిరుగుతుండగా భుజమ్మీద పప్పు మూట, చేతిలో నూనె డబ్బాతో వస్తున్న కమాటి కర్రన్న ను ఢీ కొట్టేడు. నోటికొచ్చిన బూతులతో తరిమి కొట్టేడు కర్రన్న.

' ఈడొకడు. అవన్ని ఎక్కడికి మోసేస్తున్నాడో..' అని కసిదీరా మరో బూతును సంధించి విల్లు విడిచిన బాణం అయ్యేడు.

బూతద్దం మేస్టారుని చేరుకున్నాడు. నిప్పు అందించేడు. సిగరెట్ అంటుకుంది. గుప్పు గప్పున పొగ వదుల్తూ "వెర్రీ గుడ్ రా.. వెయ్యేళ్ళు వర్ధిల్లు." తెరలు తెరలుగా నొక్కి చెప్పేరు. అది దీవెనో, శాపమో వాడికే అర్థం కాలేదు. అప్పటికి తిట్టనందుకు సంతోషపడిపోతూ జారుకున్నాడు.

కొండగాలిలో వూరు సేద దీరుతోంది. చెమట చుక్కల్ని సాయంత్రం చల్లబరుస్తుంది. గోధూళి వేళ పిల్లన గ్రోవి పాటల్తో హుందాగా కొండదిగి ఊరు చేరుతుంది పశువుల మంద. వాటి వెనుక నుంచి వీధి చివర మండంగోడు, బిడ్డికోడు పోట్లాడుతూ... పెద్ద పెద్ద కేకలేస్తూ... తూలుతూ.. ఉర్లోకి దిగుతున్నారు.

"ఒరే సన్నాయి... ఎప్పుడొచ్చినావురోయి....? బాగున్నావా? అని భుజం మీద చేతులేసి తూలుతూ పట్టుకున్నాడు బిడ్డికి మామ.

విప్పసారా కంపు... చుట్ట కంపు... గుప్పున ఆవరించింది.... ఆ రోజు ఇలాగే స్కూల్లో వాంతొచ్చినంత పనైంది.

"ఆఠీన్ రాణి"

"కాదు డైమండ్ రాజు"

"రాణీ అండీ"

"రాజండీ" రాణి మీద రాజు, రాజు మీద రాణి తిరగమరగా అవుతున్నారు రూమ్‌లో.

మ్... మ్మ్చ్... పిల్లీ రావే...

ఇదుగోండి... ఎసిడిసీ కార్డు.... షో... ఆఠీన్లు ... కళవర్లు వాదించుకుంటూ డైమన్లు, ఇస్పేట్లూ పోట్లాడుకుంటుంటె. ఇది మామూలే అన్నట్లు ఆ పక్కనుండే నడిచి వెళ్ళిపోతున్నారు పిల్లలు.

రీఫిల్ మాస్టారు బయటికొచ్చేరు. ఆ గొడవ నుండి పిల్లిని చూసిన ఎలకైపోయేరు పిల్లలు ఏ పని చెప్తారోనని. అది చెయ్యలేకపోతే తిడతారో, కొడతారో మాష్టారి ఒంటి మీద ఫేంట్ మాత్రమే ఉంది. నోట్లో కిళ్ళీ పళ్ళని, ఒంట్లోని మత్తు కళ్ళని ఎరుపెక్కిస్తు న్నాయి. అడుగులు తూలుతున్నాయి.

మాష్టారు పిలిచేరు.... పిల్లి నోటికి దొరకినట్లు సన్నాయి ఇరుక్కున్నాడు. ఖాండ్రించి ఉమ్మి..''వెళ్ళి ఓ కిళ్ళీ పట్రా... రాత్రికి ఉండిపోతానని చెప్పు. కోడేదో చూడమను'' ముద్ద ముద్దగా కంపు కంపుగా చెప్పేరు. వాంతొచ్చినట్టు కడుపు తిప్పింది. ఆ కబురికి అక్క యింత బెల్లం ముక్క ఇచ్చింది. అది తింటూ నవ్వుకున్నాడు.

అవున్రా సీకట్లో ఏటి సేత్తన్నావురా ఆదిగాడి పిలుపుతో మళ్ళీ ఈ లోకానికి వచ్చేడు సన్నాయి. " ఏట్లేదురా ఇక్కడికొస్తే స్కూలుకెలిపోవాలనుంది. స్కూలుకల్తే ఇంటికొచ్చేయాలనిపిస్తోంది. '' బాధను వ్యక్తం చేసేడు. "సదివితే సదవడం, లేకపోతే బడి మానేయడమే'' ఒక్క ముక్కలో తేల్చి పారేశాడు ఆదిగాడు. అమ్మో బడి మానీయడమా... ఎలా? అదీ ఇష్టం లేదు.

పాటలు గుర్తొచ్చాయి... కథలు గుర్తొచ్చాయి... బొమ్మలు కనిపించేయి. ఇష్టమైన పాటల మేష్టారు గుర్తొచ్చారు. తను గీసిన హంస బొమ్మకు రంగులు దిద్దుతుంటే ఆ మాష్టారొచ్చేరు. సంచి మేష్టారు తిట్టినట్టు తిడతారని భయంతో పుస్తకాల్లో దాచేశాడు. కాని అది చూడనే చూశారు. నవ్వేరు. రెక్కల వంపుని సరిచేశారు. ఆ రంగు కాదని అసలు రంగుని దిద్దేరు. నిజంగా అప్పుడది తననుకున్న బొమ్మైంది. క్లాసులో అందరికీ చూపించేరు. బాగుంది అని భుజం మీద చెయ్యేసేరు. సంతోషంతో ఉబ్బితబ్బిబ్బై పోయాడు. కుశల ప్రశ్నలతో పాఠం మొదలైంది. బోర్డు మీద బొమ్మయ్యింది. కళ్ళముందు కదలాడింది. కొత్త పాటకు రాగం కూర్చి అందరికీ నేర్పించారు. ఆ పాటలు, పాఠాల కోసం.... ఆ ప్రేమ కోసం బడికెళ్ళాలనిపించింది.

భూతద్దం మేష్టారు, బెల్టు మేష్టారు, వార్డెన్... అందరూ గుర్తొచ్చేరు. భయమేసింది. దిగులు చుట్టుకుంది. ఇంక బడికెళ్ళకూడదని అనుకున్నాడు. "ఒరే సన్నాయీ.. మీ ఇంటికెవలోగాని వచ్చేర్రా...'' పరిగెత్తుకొచ్చి, రొప్పుతూ చెప్పేడు ఆదిగాడు.

"ఎవరు?..... ఎందుకొస్తారు...? ఏమో....?" మామిడి చెట్టు మొదలుమీద రాయితో తన పేరు చెక్కుతూ అక్కడే ఉండిపోయేడు. కొంత సేపటికి ఇంటికి చేరేడు. నులక మంచం మీద పాటల మేష్టారు. అప్రయత్నంగా రెండు చేతులూ జోడించేడు. గంప నిండా సీతా ఫలాలు, మాష్టారి ముందుంచేడు నాన్న. తింటూ వింటున్నారు మేష్టారు. "ప్రక్క ఊరిలో పనుండి వచ్చాను. అలాగ కొండ చూద్దామని ఈ ఊరు దిగేను" నాన్నతో చెప్తున్నారు.

"ఏరా సన్నాయి... బాగున్నావా? అడిగేరు. తలూపాడు. వెళ్తానని లేస్తూ..." బడికెప్పుడు వస్తావురా? నాతో ఒచ్చీకూడదూ" అని అన్నారు. సన్నాయి నోట మాటరాలేదు. గడపలోని రాటను కౌగలించుకొని రానన్నట్టు నిలబడి పోయేడు మౌనంగా. "ఏం రా అని వాడి భుజం మీద చెయ్యి వేసి అలా సీతా ఫలం తోటవైపుకి నడిపించుకెళ్ళేరు.

స్కూలు గుర్తొచ్చిందో లేక ఇల్లు వదలలేక పోతున్నాడో మరి వాడి కళ్ళలోంచి బొట బొటా కన్నీళ్ళు రాలాయి. మాష్టారు వాడిని దగ్గరకు తీసుకున్నారు. ఓదార్చేరు. వెక్కి వెక్కి ఏడ్చేడు సన్నాయి.

"అమ్మ నాన్నను చూస్సేవు కదా... స్కూలుకి పద.. హాయిగా చదువుకో..." బడికి రాలేక అక్కడే ఉండలేక వెక్కిళ్ళతో నిలబడిపోయాడు. " ఏమైంది... ఎందుకు రావు?" అడిగేరు. మౌనంగా నేల చూపులు చూస్తూ ఉండిపోయాడు. ఆ చూపులు 'మీకు తెలేదేటి?' అని తిరిగి ప్రశ్నిస్తున్నట్టున్నాయి. వాడిని కాసేపు మాటల్లో పెట్టేరు. "ఒరే సన్నాయి... అదిగో ఆ కాయ బాగున్నట్టుంది. కావాలి. కొట్టివ్వగలవా?" అడిగేరు మాస్టారు.

రాయిని తీసి నిల్చున్న పాటుగా ఒకే దెబ్బకి పడగొట్టి మాష్టారి చేతిలో ఉంచేడు సన్నాయి. నవ్వుతూ అందుకున్నారు. "చూసేవా..? ఆ కాయ ఎన్ని కొమ్మల మధ్య ఉందో? ఎన్ని ఆకులు అడ్డంగా ఉన్నాయో... నీవు నిల్చున్న దగ్గర చూడు ఎన్ని ముళ్ళున్నాయి, బండరాళ్ళున్నాయి....ఇవన్నీ నీకు అడ్డమయ్యాయా?"... అని దగ్గరకు తీసుకొని "చదువూ అంతేన్రా... దాని మీద మనసు పెడితే మిగతావేవీ కనబడవు. అన్నీ అధిగమించినపుడే మనకది దొరుకుతుంది. నేనున్నాను కదా..." అని ధైర్యం చెప్పేరు.

బట్టలు, పుస్తకాలతో పాటు మేష్టారి కోసం సీతాఫలాలు సర్ది సన్నాయికిచ్చాడు నాన్న.

అడివి చిరుగాలై నవ్వింది.

పెరట్లో నెమలి పురివిప్పి ఆడింది. ◆

*'బడి కథలు' సంకలనం- సం.2000*

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=2638**

* * *